# ఏడుపాయల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

**పాపన్నపేట, జనవరి 16, ప్రభాతవార్త:**
మండలంలోని ఏడుపాయల వనదుర్గా ప్రాజెక్టు సమీపంలోని దుకాణాల వెనుకాల ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహభాన్ని ఆదివారం గుర్తించారు. పాపన్నపేట ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం... 50 నుంచి 55సంవత్సరాల వయసు గల వ్యక్తి దుకాణాల వెనుకాల గల పొదల్లో మృతదేహాన్ని గుర్తించామన్నారు. మృతుడు ఆరెంజ్ రంగు చొక్కా, నలుపు రంగు షార్టు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహం పక్కలో టిఫిన్ బాక్కు ఉందన్నారు. గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో వ్యక్తి మృతి చెంది ఉండవచ్చని ఎస్సై అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి మెదక్ ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ వివరించారు. మృతదేహాన్ని గుర్తించి వ్యక్తులు 9440627014కు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.




## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి : అదనపు కలెక్టర్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను అదేశించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి అయన మాట్లాడారు. ప్రజావాణి దరఖాస్తులనే అధికారులు నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ప్రజావాణి దరఖాస్తులపై సంబంధితశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న బాబు మల్‌శెట్టి

## రెండవ విడత గొర్రెలను పంపిణీ చేయాలి

### సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాబు మల్‌శెట్టి

**సంగారెడ్డి, జనవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యాదవులకు రెండవ విడత గొర్రెలను ప్రభుత్వం వెంటనే పంపిణి చేయాలని గొర్రెల మేకల పెంపకం దారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాబు మల్‌శెట్టి డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన చౌటకూరులో గొర్రెల మేకల పెంపకం దారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గొర్రెల మేకల పెంపకం దారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాబు మల్‌శెట్టి మాట్లాడుతూ జిఓ 559 ప్రకారం ప్రతి సంఘానికి 5 ఎకరాల భూమిని కేటాయించాలని గుర్తు చేశారు. కర్ణాటక రాష్ట్రంలో కుర్మలను ఎస్‌టి జాబితాలో చేర్చారని, తెలంగాణలో సైతం ఎస్‌టిలుగా గుర్తించాలని సూచించారు. గొర్రె కాపరులు మృతి చెందితే భీమా కింద 1 లక్ష రూపాయలు చెల్లిస్తున్నారని, భీమాను 5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాల వయసు దాటిన గొర్రెకాపరులకు 3వేల రూపాయల పెన్షన్‌ను అందచేయాలని బాపు మల్‌శెట్టి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు నాగయ్య, మండల అధ్యక్షులు కె రవి, నాయకులు వీరేశం, కిషన్, రాములు, పెంటయ్య, మల్లేశం, వీరయ్య, లింగమయ్య, ఈరయ్య, ఆశయ్య, గుండయ్య, పోచయ్య, క్రిష్ణ, నాగేశ్ పాల్గొన్నారు.

## కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

### -జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్


కంటి వెలుగు ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

**ములుగు, జనవరి 16 (ప్రభాతవార్త):**
రాష్ట్రంలో అంధత్వ నివారణే లక్ష్యంగా సిఎం కెసిఆర్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన కార్యక్రమం కంటి వెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ కోరారు. సోమవారం ములుగు గ్రామపంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడత కంటి వెలుగు పథకం రాష్ట్రంలో ఎంతో మంది పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిందని, కంటి వెలుగు పథకం ప్రారంభించి ఐదు సంవత్సరాలు గడుస్తున్న క్రమంలో రెండవ విడత కార్యక్రమాన్ని ఈనెల 18వ తేదీన ఖమ్మంలో సిఎం కెసిఆర్ ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చూసుకోవాలని ఆదేశించారు. ఎంపిడిఓ వెంకటేశ్వర్‌రెడ్డి, డాక్టర్ అఖిలప్రియ, పంచాయతీ కార్యదర్శి శాంతి తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్


కంటి వెలుగు ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ముజామిల్ ఖాన్

**దుబ్బాక, జనవరి 16, ప్రభాత వార్త:** ఈ నెల 19 నుండి ప్రారంభం కానున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్ ముజామిల్ ఖాన్ సోమవారం పరిశీలించారు. అలాగే దుబ్బాకలో త్వరలో ప్రారంభం కానున్న బస్తీ ధవాఖాన నిర్మాణ పనులను పరిశీలించారు. కంటి పరీక్షలు చేయించుకోవడానికి వచ్చే ప్రజలకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని దుబ్బాక కమిషనర్ గణేష్ రెడ్డిని, వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ గన్నె వనితభూంరెడ్డి, డిప్యూటి జిల్లా వైద్యాధికారి, మెడికల్ అధికారి భార్గవి, వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు, ఆర్పీలు తదితరులు ఉన్నారు.

## వర్గల్‌లో కంటి వెలుగు ఏర్పాట్ల పరిశీలన

**వర్గల్, జనవరి 16 (ప్రభాతవార్త):** వర్గల్ మండలం అంబర్‌పేట గ్రామంలోని గ్రామపంచాయతీ భవనంలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లను సోమవారం జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా టాబ్‌లో సభ్యుల నమోదు వివరాలను పరిశీలించారు. అన్ని వసతులు కల్పిస్తున్నామని, ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే డిఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించుకోవాలని అన్నారు. ఆయా గ్రామాల్లో సిబ్బందికి భోజనానికి సంబంధించి ఏర్పాట్లు ఎంపిడిఓ, స్థానిక పంచాయతీ సెక్రటరీ చూసుకోవాలని, సిబ్బంది 8.30 గంటల వరకు సెంటర్‌కు చేరుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డిఎంహెచ్‌ఓ కాశీనాథ్, గజ్వేల్ డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్‌ఓ విజయరాణి, ఎంపిడిఓ మేరీస్వర్ణకుమారి, గ్రామ సర్పంచ్ నర్సింహ్మారెడ్డి, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.


అంబర్‌పేటలో కంటి వెలుగు ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

# కంటి వెలుగు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం

## జిల్లా కలెక్టర్ హరీష్

**మెదక్ , జనవరి 16 ప్రభాతవార్త:**
కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ హరీష్ తెలిపారు. సోమవారం మంత్రి హరీష్‌రావు ఖమ్మ కలెక్టర్ కార్యాలయం నుంచి, రాష్ట్ర సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీ కుమార్, వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ రిజ్వి, కమీషనర్ శ్వేతలు హైదరాబాద్ బీఆర్‌కే భవన్ నుంచి కంటి వెలుగు క్యాంపుల నిర్వహణ పట్ల తీసుకోవాల్సిన చర్యలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మేడ్చల్ జిల్లా నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హరీష్ మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని, సంబంధించిన అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి దిశా నిర్ధేశం చేశామన్నారు. ఒక్కో బృందంలో 8 మంది సభ్యులతో 40 బృందాలు ఏర్పాటు చేసి జిల్లాలోని 469 గ్రామ పంచాయితీలు, 75 మున్సిపల్ వార్డుల్లో జూన్ 28 వరకు 544 శిబిరాల ద్వారా కంటి పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు. శిబిరాల నిర్వహణకు సంబంధించి మాక్ డ్రిల్ కూడా నిర్వహిస్తున్నామని అన్నారు. కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారంతో పాటు రేషన్ షాపుల వద్ద, పెట్రోల్ బంకుల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బృందాలు రాత్రి బస చేయడానికి అనువైన ప్రదేశాలు గుర్తించి తగు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా పరిషత్ సీఈవో వెంకటేష్, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయనిర్మల, జిల్లా పంచాయితీ అధికారి రాజేంద్రప్రసాద్, మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, ఇతర అధికారులు


పుల్లూరు బండ జాతర గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి హరీష్‌రావు

## ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం స్వయంభూ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రం

### మంత్రి తన్నీరు హరీష్‌రావు

**సిద్దిపేట రూరల్, జనవరి 16, ప్రభాతవార్త :**
జిల్లాలో ప్రసిద్దగాంచిన పుణ్యక్షేత్రం పుల్లూరు బండ స్వయంభూ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రానికి వందల వేల సంవత్సరాల ప్రాచీన చరిత్ర ఉందని రాష్ట్ర ఆర్థిక,ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని పుల్లూరు బండ క్షేత్రంలో ఈనెల 20 నుంచి 24 వరకు 5 రోజుల పాటు జరిగే జాతర గోడ పత్రికను సోమవారం హైదరాబాల్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. పుల్లూరు బండ జాతరకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. 8 వందల యేండ్ల క్రితం కాకతీయుల కాలంలో ఇక్కడ దేవాలయం నిర్మించారని తెలిపారు. ప్రతి యేటా మాఘమ అమావాస్య సందర్భంగా జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. సిద్దిపేట, దుబ్బాక బస్ డిపోల నుంచి జాతరకు ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసి అధికారులను మంత్రి అదేశించారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను అదేశించారు. ప్రాచీనమైన ప్రఖ్యాతిగాంచిన పుల్లూరు బండ క్షేత్రిన్ని సిఎం కెసిఆర్ సహకారంతో ఎంతో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్‌లో పుల్లూరు బండ క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తా మన్నారు. దేవాలయ వైదిక కార్యక్రామల నిర్వాహకులు కలకుంట్ల కృష్ణమాచారి, వంశపారంపర్య అర్చకులు కలకుంట్ల వెంకటనర్సింహచార్యులు,కలకుంట్లరంగాచార్యులు, కలకుంట్ల వీణాచారి, నవీన్‌కుమారాచార్యులులు మంత్రిని స్వామి వారి శేష వస్త్రం, శాలువాతో సన్మానించి ఆశీర్వచనం అందజేశారు. కార్యక్ర మంలో సర్పంచ్ నరేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ గడ్డం తిరుపతిరెడ్డి, నాయకులు తోర్నాల దుర్గారెడ్డి, దేవాలయ కమిటీ డైరెక్టర్లు కోడూరి శ్రీనివాస్, లక్ష్మీమల్లేశం, అంజయ య్య, బాలయ్య, బిఆర్ఎస్ నాయ కులు మల్లేశం, శ్రీనివాస్, చంద్రమౌళి, దేవేందర్ తదితరులు పా ల్గొని మంత్రి హరీష్‌రావుకు జాతర అహ్వాన పత్రికను అందజేశారు.

# మన ఊరు-మన బడి పనుల నిర్వహణ నుండి ప్రధానోపాధ్యాయులను మినహాయించాలి

## -తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్

**మెదక్ మున్సిపాలిటీ, జనవరి16 ప్రభాతవార్త:**
మన ఊరు-మన బడి పనుల నిర్వహణ నుండి ప్రధానోపాధ్యాయులను మినహాయించాలని తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధ్యాయులకు భోదనేతర పనులు అప్పగించి విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా చేస్తుందని, హెచ్‌ఎంలకు తమకు సంబంధం లేని సివిల్ వర్క్స్ అప్పగించి సకాలంలో పూర్తి చేయడం లేదని తీనరవ ఒత్తిడికి గుర్తి చేస్తుందన్నారు. హెచ్ఎంలు పిల్లలకు పాఠాలు చెప్పే సమయం లేక మరోవైపు మన ఊరు-మన బడి పనులు త్వరగా పూర్తి చేయాలని పై అధికారులు ఒత్తిడి వల్ల తీవ్ర ఆందోళనకు, ఒత్తిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మన ఊరు-మన బడికి సంబంధించి హెచ్‌ఎంలకు, మండల స్థాయి, జిల్లా స్థాయి అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో డీఈవోలను సైతం తీవ్ర వేధింపులకు గురి చేస్తుందని తెలిపారు. మన ఊరు-మన బడి పనులను ఇతర గుత్తేదారులకు అప్పగించి హెచ్‌ఎంలను తప్పించాలని తపస్ మెదక్ జిల్లా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందన్నారు. అలాగే టీచర్లకు బదిలీలు, పదోన్నతులకు త్వరలో షెడ్యూల్ విడుదల అంటూ మరోసారి టీచర్లను వంచించడానికి సిద్ధమైందని, మార్చిలో జరిగే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో లబ్ధి పొందడానికి మాత్రమే ఇలాంటి ప్రకటనలు చేస్తుందని దుయ్యబట్టారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎంటువంటి వివాదాలకు తావివ్వకుండా వెంటనే షెడ్యూల్ ప్రకటించి ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జీవో 317ను సవరించి స్థానికత ఆధారంగా వారి వారి స్వంత జిల్లాలకు పంపించాలని, స్పౌజ్ కేసులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత పీఆర్సీ గడువు జూన్ నెలతో ముగుస్తుంది కావున కొత్త పీఆర్సీని 80 శాతం ఫిట్‌మెంట్‌తో జూలై 1 నుండి అమలు చేయాలన్నారు. డీఏ, పీఆర్సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని, ప్రతి నెల ఒకటో తారీకు జీతాలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి విద్యాశాఖలోని సమస్యలన్నీ సకాలంలో పరిష్కరించకపోతే తపస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యలకు పరిష్కారం సాధించుకుంటామని జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్‌లు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు శ్రీధర్‌రెడ్డి, వినోద్, మెదక్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నర్సింలు, మధుమోహన్, పాపన్నపేట ప్రధాన కార్యదర్శి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తపస్ మెదక్ జిల్లా అధ్యక్షులు జిడ్డి ఎల్లం

## రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీని ప్రారంభించిన ఎఫ్‌డీసీ చైర్మన్, ఎమ్మెల్సీ


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రతాప్‌రెడ్డి, యాదవరెడ్డి

**జగదేవ్‌పూర్, జనవరి 16 (ప్రభాతవార్త):**
జగదేవ్‌పూర్ మండలకేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కెసిఆర్ క్రికెట్ టోర్నీని సోమవారం రాష్ట్ర ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డిలు క్రికెట్ ఆడి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ యువకుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించి చెడు వ్యసనాలకు దూ రం చేసేవిధంగా ఈ టోర్నీ నిర్వహించడం అభినందనీయమని, ఈ టోర్నీకి మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాచర్ల నరేష్ ప్రథమ బహుమతికి రూ. 50వేలు, ద్వితీయ బహుమతికి రూ.25వేలు, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌కు రూ.5వేలు అందించడం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యువకులు క్రీడల్లో పాల్గొని తమ నైపుణ్యాలను పరీక్షించుకోవాలని, యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడలపై మక్కువ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బాలేషంగౌడ్, ములుగు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ గుండా రంగారెడ్డి, ఎంపిటిసిల ఫోరం జిల్లా అధ్యక్షుడు కారింగుల కిరణ్‌గౌడ్, గజ్వేల్ ఏఎంసి వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్‌రెడ్డి, స్థానిక ఎంపిటిసి కవిత శ్రీనివాస్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఎక్బాల్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు రావికంటి చంద్రశేఖర్, శ్రీపతి రాజేశ్వరిరవి, గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షుడు నాగరాజు, బిఆర్ఎస్ జిల్లా యువజన నాయకులు ఆలేటి సంతోష్‌రెడ్డి, కొండపోచమ్మ ఆలయ డైరెక్టర్ కుమ్మరి కనకయ్య, బిఆర్ఎస్ గ్రామ మాజీ అధ్యక్షుడు కొంపల్లి శ్రీనివాస్, బిఆర్ఎస్ మండల పార్టీ అధికార ప్రతినిధి పరమేశ్వర్‌ముదిరాజ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్న క్షేత్రంలో పర్యటించిన దేవాదాయ కమిషనర్

## ఇప్పటి నుంచి ఆన్‌లైన్‌లో మల్లన్న అర్జిత సేవలు

**కొమురవెల్లి, జనవరి 16, ప్రభాతవార్త :**
కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి క్షేత్రంలో సోమవారం దేవాదాయ ధర్మదాయ శాఖ కమిషనల్ అనిల్‌కుమార్ అకస్మికంగా పర్యటించారు. స్వామి వారి క్షేత్రానికి వచ్చిన కమిషనర్ మొదటగా మల్లన్న క్షేత్రంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్న మల్లన్న జాతర, బ్రహ్మోత్సవాలకు అలయ అధికారులు,పాలక మండలి కల్పించిన వసతులు, చేపట్టిన పనులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుట్టపై ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ అలయాన్ని సందర్శించారు. అక్కడి నుంచి బండగుట్ట, దాసారంగుట్టతదితర ప్రదేధాల వద్దకు వెళ్లి అక్కడ జరుగుతున్న 50 కాటేజీల నిర్మాణాలతో పాటు దాసారం గుట్టపైకి వేస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. అలాగే మహామండపంలో ఒగ్గు పూజారులతో పట్నం వేయించి మెక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మల్లన్న అలయానికి సంబంధించిన అర్జిత సేవలను 15 రోజుల్లో అన్‌లైన్ సౌకర్యం కల్పిస్తామన్నారు. తడకల పందిళ్లు లేకుండా శాశ్వతంగా షెడ్స్ ఏర్పాటు చేయిస్తామన్నారు. అలాగే క్యూ కాంప్లెక్స్ నిర్మాణానికి త్వరలో నిధులు విడుదల చేస్తామన్నారు, దాసారం గుట్ట కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అయన వెంట ఈవో బాలాజీ, పాలక మండలి చైర్మన్ గీస బిక్షపతి, ఏఈవో వైరాగ్యం అంజయ్య, అలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, పాలక మండలి సభ్యులు సూటిపల్లి బుచ్చిరెడ్డి, నర్రా రఘువీర్‌రెడ్డి, అలయ సిబ్బంది, ఒగ్గు పూజారులు ఉన్నారు. కాగా మల్లన్న క్షేత్రంలో పెండింగ్‌లో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేయాలని అలయ చైర్మన్ కుర్చీలో చైర్మన్ కుమారున్ని కూర్చోబెట్టి కుర్చీని అవమానించిన విషయంలో విచారణ చేపట్టాలని కోరుతూ బిజెపి, కాంగ్రెస్, పార్టీల అధ్వర్యంలో నాయకులు దేవాదాయశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న దేవాదాయ కమిషనర్

# సంక్షేమ పథకాలు దేశమంతా విస్తరించడానికే బీఆర్ఎస్ పార్టీ

## ఎంపి ప్రభాకర్‌రెడ్డి


ఎల్లబండిపై బండ మల్లన్న జాతరకు వస్తున్న ఎంపి ప్రభాకర్‌రెడ్డి

**మిరుదొడ్డి, జనవరి 16, ప్రభాతవార్త :** ప్రత్యేక తెలంగాణ సాధించుకున్న తర్వాత సిఎం కెసిఆర్ ఆధ్వర్యంలో వ్యవసాయరంగానికి పెద్ద పీట వేయడం జరిగిందని మెదక్ ఎంపి, జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వీరారెడ్డిపల్లి, జం గాపల్లి జరిగిన బండ మల్లన్న జాతరలో అయన పాల్గొన్నారు. ఎడ్ల బండి మీద జాతరకు వచ్చి మల్లన్నస్వామికి, అంజనేయ స్వామికి ప్రత్యేక పూజల నిర్వహించారు. అనంతరం అయన మాట్లాడుతూ గ్రామాలకు మూలాధారమైన వ్యవసాయంకు సీఎం కెసిఅర్ అండగా నిలుస్తున్నారని తెలిపారు. దేశంలోనే తెలంగాణ పంటల దిగుబడిలో ముందు వరసలో ఉందన్నారు. వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్‌తో పాటు రైతు బీమా, రైతుబంధు పథకం అందించడం జరుగుతుందన్నారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమాన్ని దేశమంతా విస్తరించడానికే సిఎం కెసిఅర్ బీఅర్ఎస్ పార్టీని ప్రారంభించారని తెలిపారు. ఖమ్మంలో జరిగే బహిరంగ సభతో దేశ రాజకీయాల్లో కెసిఅర్ చక్రం తిప్పడం ఖాయమన్నారు. ప్రజలందరూ సుఖ:సంతోషాలతో అయు అరోగ్యాలతో ఉండాలని మల్లన్న స్వామి వేడుకున్న ట్లు తెలిపారు. అయన వెంట ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# కారు, బైక్ ఢీ.. యువకుడి మృతి

**సంగారెడ్డి, జనవరి 16, ప్రభాతవార్త:** కారు బైక్ ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణ శివారులోని రామ్‌నగర్‌లో ఆదివారం రాత్రికి చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ కే శ్రీకాంత్ కథనం ప్రకారం... మండలంలోని హోతి గ్రామానికి చెందిన కృష్ణ స్థానికంగా ఉన్న మహీంద్రా కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడన్నారు. ఆదివారం రాత్రికి తన బంధువైన శివాజీతో కలిసి బైక్‌పై హోతి(బి) గ్రామం నుంచి జహీరాబాద్‌కు వస్తుండగా చిన్న హైద్రాబాద్ రాంనగర్ గ్రామాల మధ్యలో బైకును కారు ఢీకొనగా బైకును తోలుతున్న కృష్ణ అక్కడికి అక్కడే కానరాని లోకాలకు చేరిపోయాడన్నారు. బైక్ వెనుకాల కూర్చున్న శివాజీ తీవ్ర గాయాలకు గురవడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించామన్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చకేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ వివరించారు.

## రోడ్డుకు మరమ్మత్తు పనులు చేపట్టాలి

**విలేఖరులతో మండల కాంగ్రెస్ నాయకులు**

**సంగారెడ్డి, జనవరి 16, ప్రభాతవార్త:** మండలంలోని మావినెట్టి గ్రామానికి వెళ్లే రోడ్డుకు వెంటనే మరమ్మత్తు పనులు చేయించాలని మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, గుండేరావు పాటిల్, మనోహర్ పాటిల్‌లు గ్రామ కమిటి నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రోడ్డు మరమ్మత్తు పనులకు నిధులు మంజూరైనా ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదని విచారం వ్యక్తం చేశారు. గ్రామంలోని పాఠశాలకు ఉపాధ్యాయులు సక్రంగా విధులకు హాజరుకావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామానికి వచ్చే రోడ్డుకు మరమ్మత్తు పనులు పూర్తి చేయించడంతో పాటు పాఠశాలకు ఉపాధ్యాయులు సమయసారణి పాటిస్తూ విధులకు హాజరయ్యేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ సంగ్‌శెట్టి పాటిల్, బసవరాజు, వెంకట్‌రావు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో క్రీడాకారులకు మానసిక ఉల్లాసం

**-హోప్ న్యూరో ఆస్పత్రి ఎండి డాక్టర్ కృష్ణమూర్తి**

**రాయికోడ్, జనవరి 16, ప్రభాతవార్త:** మండలంలోని పీపడ్‌పల్లి గ్రామంలో భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన వాలీబాల్ పోటీలు సోమవా రంతో ఘనంగా ముగసాయి. టోర్నీలో పాల్గొన్న జట్లు నువ్వా నేనా అన్నట్లు తలపడ్డాయి. టౌర్నమెంట్ విజేత పట్టుకు 25వేల నగదుతో పాటు కప్పును అందచేశారు. ఈ సందర్భంగా హోప్ న్యూరో హాస్పిటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ యువత తమలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని గ్రామాల్లో నిర్వహించే టౌర్నమెంట్‌ల ద్వార బహిర్గతం చేసుకోవా లన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి అనిల్ కుమార్, మాజీ సర్పంచ్ రవికుమార్, స్పోర్ట్స్ ఆర్గనైజర్ నర్సింలు, ప్రొఫెసర్ లింగం, యూత్ అధ్యక్షులు బస్‌లింగప్ప, యువజ సంఘం సభ్యులు లింగపప, బక్కప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పొట్‌పల్లి సర్పంచ్ మృతి

**ఝరాసంగం, జనవరి 16, ప్రభాతవార్త:** మండలంలోని పొట్‌పల్లి గ్రామ సర్పంచ్ బి ధన్‌రాజ్ పాటిల్ అకాల మృతి చెందారు. సంక్రాంతి పర్వ దినమైన ఆదివారం రాత్రి గ్రామ సర్పంచ్ గెండెపోటులో తిరిగిరాని లోకాలకు చేరిపోయారు. గ్రామ సర్పంచ్ మృతి చెందినట్లు తెలుసుకున్న టిపిసిసి సభ్యులు వై నరోత్తం పొట్‌పల్లిలోని ధన్‌రాజ్ స్వగృహానికి చేరుకుని పార్థీవ దేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామాభివృద్ధికి ధన్‌రాజ్‌పాటిల్ చేసిన సేవలను నరోత్తం కొనియాడారు.

## కోహీర్ తహసిల్దార్ సీనియర్ అసిస్టెంట్ సత్యం సస్పెన్షన్



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు

**సంగారెడ్డిబ్యూరో జనవరి 16,ప్రభాతవార్త:**

ప్రభుత్వం నుండి బాదితురాలికి రవాలసిన నష్టపరిహారం ఇప్పించడంలో అవినీతికి పాల్పడిని కోహీర్ తహసిల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సినియర్ అసిస్టెంట్ సత్యంను సస్పెన్షన్ చేస్తూ జిల్లా కలెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కోహీర్ మండలంకు చెందిన అంతారం శ్రుతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో హజరై ఎస్సీ,ఎస్టీ ఆట్రాసిటి బాదితుల నష్టపరిహరం ద్వారా మంజూరైన, నష్టపరిహరం రావాలంటే 50 వేల కలెక్టర్ కార్యాలయంలో ఖర్చులు అవుతాయని, ఇవ్వాలని కోహీర్ తహసిల్దార్ కార్యాలయంలో సినియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సత్యం డిమాండ్ చేశాడని కలెక్టర్ ఎ.శరత్‌కు అంతారం శ్రుతి పిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన కలెక్టర్ సినియర్ అసిస్టెంట్‌ను సస్పెన్షన్ చేయాలని సంబందిత అధికారులకు ఆదేశించారు. సాయంత్రమే సత్యంను సస్పెన్షన్ చేస్తూ ఆదనపు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## 13వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్**

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 16, ప్రభాతవార్త:**

జిల్లాలోని ఈనెల 25వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని యాక్షన్ ప్లాన్ మేరకు ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి తో కలిసి 13వ జాతీయ ఓటరు దినోత్సవ వేడుకల నిర్వహణపై స్వీప్ నోడల్ అధికారి, ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఎమ్మెన్నార్ మెడికల్ కళాశాల, తారా డిగ్రీ కళాశాల, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఏఈఆర్‌ఓలతో సమావేశం నిర్వహించిన దిశా, నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం 13వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని జరుపుకోనున్నట్లు తెలిపారు. జాతీయ ఓటర్ దినోత్సవంలో భాగంగా నిర్వహించు వివిధ కార్యక్రమాలను కోవిడ్ నిబంధనలను పాటిస్తూ నిర్వహించాలని సూచించారు. జాతీయ ఓటరు దినోత్సవం పై విస్తృత ప్రచారం జరగాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని జిల్లాస్థాయి, ఈ ఆర్వో, ఏఈఆర్‌ఓ స్థాయిలో అదేవిధంగా ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో బూత్ లెవెల్ అధికారులు నిర్వహించాలన్నారు. కొత్తగా నమోదైన ఓటర్లను సన్మానించి వారికి (ఎపిక్‌కార్డ్) ఓటరు కార్డు అందజేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలో జిల్లా ఎన్నికల అధికారి జాతీయ ఓటరు దినోత్సవ వేడుకను వివిధ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ పంచాయతీరాజ్, సివిల్ సొసైటీ గ్రూప్స్, యూత్ వాలంటరీస్ ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, నెహ్రు యువ కేంద్రం, మీడియా తదితరుల సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. అట్టి కార్యక్రమంలో కొత్తగా రిజిస్టర్ అయిన ఓటర్లను సన్మానించి, వారికి ఓటర్‌కార్డ్‌ను అందజేయాలని సూచించారు. జాతీయ ఓటర్ దినోత్సవం ప్రతిజ్ఞను చేయించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్వీప్ నోడల్ అధికారి సురేష్ మోహన్, జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజన్ అధికారి నగేష్, ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కళాశాలల ప్రిన్సిపల్, తారా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా ఇంటర్మీడియల్ అధికారి గోవిందరామ్, ఏఈఆర్‌ఓలు, కలెక్టరేట్ ఏవో మహిపాల్‌రెడ్డి, ఎన్నికల విభాగపు సూపరింటెండెంట్ తిరుమల రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శరత్, పక్కన అదనపు కలెక్టర్ వీరారెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి నగేష్



మనూర్‌లో సంక్రాంతిని పురష్కరించుకుని ముగ్గులు వేస్తున్న దృశ్యం



చౌట్కూర్‌లో యువకులు పతంగులు ఎగరేస్తున్న దృశ్యం



ఇళ్ల ముందు ముగ్గులు వేస్తున్న యువతులు




అల్లాదుర్గంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గులు వేస్తున్న చిన్నారి

# సంగారెడ్డిలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

**మనూర్, జనవరి 16, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో సంక్రాంతి వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పండగలో భాగంగా భోగి, సంక్రాంతి, కనుమ పండగలను తమ ఇంటిల్లిపాదితో కలిసి సంబరగా జరుపుకున్నారు. పట్టణ ప్రాంతాలకు వలస వెల్లిన వారు పండగను పురష్కరించుకుని తమ స్వగ్రామాలకు చేరుకోవడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. సంక్రాంతిని పురష్కరించుకుని తమ తమ ఇంఢ్ల ముందు మహిళలు రంగు రంగుల ముగ్గులు వేయడంతో గ్రామాల్లోని వీధులన్నీ సుందరంగా మారాయి. చిన్నారులు, పెద్దలు, యువకులు పతంగులు ఎగరేసి సంబరాలు చేసుకున్నారు.

**ఘనంగా ఉమ్మడి మండలంలో..**

**సంగారెడ్డి, జనవరి 16, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్కల్ మం డలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు సంక్రాంతి పర్వ దినాలను ఆనందోత్స వాలతో ఘనంగా జరుపుకున్నారు. మహి ళలు, యువతులు తమ తమ ఇండ్ల ముందు రంగు రంగు ముగ్గులు వేసి సుందరగా వాకిళ్లను తయారు చేసుకున్నారు. యువకులు,వృద్దులు పతంగులు ఎగురవేసి సంబరాలు చేసుకున్నారు. చౌట్కూర్ గ్రామంలో యువకులు ఉదయాన్నే తమ ఇండ్లపై పతంగులను ఎగరేస్తూ సంద డిలో మునిగిపోయారు. చౌట్కూర్ మండలంలోని శివంపేట, లింగంపల్లి, సుల్తాన్‌పూర్, పోచంపల్లి, బొమ్మరెడ్డిపు ల్కల్ మండలంలోని సింగూర్, మంటూరు, పెద్దరెడ్డిపేట గ్రామాల్లో సంక్రాంతి సంబరాలను సందడిగా చేసు కున్నారు.

**అల్లాదుర్గంలో..**

**అల్లాదుర్గం, జనవరి 16, ప్రభాతవార్త:** అల్లాదుర్గం మండలంలో సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఇల్లముందు మహిళలు, చిన్నారులు రంగు రంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు, చెరుకు గాడెలు, ఆవు పెడ, శెనిగె, కుసుమ, గోదుమ, జొన్న దంట్లు ముగ్గుల మధ్యలో పెట్టి పూజలు చేసి తమ సంతోషాన్ని కుటుంబ సభ్యులతో పంచుకున్నారు. యువకులు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గాలిపటాలను ఎగరవేస్తూ, పోటా పోటీగా పెంఛీలు వేస్తూ తమ ఆనందాన్ని పంచుకున్నారు.

**హత్నూర మండలంలో..**

**సంగారెడ్డి, జనవరి 16,ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగను ఆదివారం హత్నూరలో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో సాంప్రదాయంగా అచరించే విధానాలతో పండుగను ఉత్స హభరిత వాతవరణంలో జరుపుకున్నారు. ఉదయంమే ఇంటి ముందు ముగ్గులతో వాకిళ్ళను ఆలంకరంచారు. చిన్నారులు, పెద్దలు కలిసి పతంగులను ఎగురవేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని నవాబుపేట, లింగాపూర్, మాదుర, గోవింద్‌రాజ్‌పల్లి, నస్తీపూర్, రెడ్డిఖనాపూర్ గ్రామాలలో ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.

**సంగారెడ్డిలో...**

**సంగారెడ్డిబ్యూరో జనవరి 16,ప్రభాతవార్త:** సంగారెడ్డిలో సంక్రాంతి పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో చిన్నారులు, పెద్దలు ఉత్సాహంగా పాల్గోని పతంగులను ఎగురవేశారు. చిన్నారులు, యువకులు, రాజకీయనాయకులు ఉత్స హంగా పాల్గోని, పతంగులను గాలిలోకి ఎగురవేశారు. రాష్ట్రచేనేత అబివృద్ది సంస్థ చైర్మేన్ చింతప్రభాకర్ టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యాకర్తలతో కలిసి సంగారెడ్డిలోని పాతబస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో పాల్గోని పతంగులను ఎగురవేశారు. స్థానిక శాసనసభ్యులు కాంగ్రేస్‌పార్టీ కార్యాకర్తలతో కలిసి సంగారెడ్డిలో పతం గులను ఎగురవేశారు. సంక్రాంతి సందర్భంగా పతంగుల కొనుగోలు దుకణాల వద్ద యువకులు, చిన్నారులు కొనుగోలు చేస్తూ, సందడిచేశారు. ఆదివారం ఉదయంమే ఇండ్లముందు రంగులతో వివిద రకాల ముగ్గులతో అలంకరించారు. సంక్రాంతి సందర్బంగా గంగిరెద్దుల వారి సందడి గతంతో పోలిస్తే తక్కువగానే కనిపించిందని స్థానికులు తెలిపారు.



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



గాలిపటంను ఎగురవేస్తున్న చింతప్రభాకర్



సంక్రాంతి ముగ్గులకు రంగులు దిద్దుతున్న మునిపల్లి ఎంపీపీ శైలజశివశంకర్




విజేత జట్టు క్యాప్టెన్ అచ్చంపేట ఎమ్మెల్యేకు ట్రోపిని అందచేస్తున్న టోర్నీ నిర్వాహకులు క్వైజర్ యాఫై దృశ్యం

## క్రికెట్ టోర్నీ విజేత అచ్చంపేట అర్బన్ జట్టు

**-విజేత జట్టుకు 5లక్షల బహుమానం**

**సంగారెడ్డి, జనవరి 16, ప్రభాతవార్త:** గత పక్షం రోజులుగా పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో జరిగిన అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసాయి. ఫైనల్ పోటీలో అచ్చపేటకు చెందిన అర్బాన్ జిబిఆర్ జట్టు అదే అచ్చంపేటకు చెందిన గ్రీన్ సిటీ జట్టుపై 101 పరుగులతో ఘన విజయం అందుకుంది. విజేతగా నిలిచిన జట్టుకు అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నాయకత్వం వహించారు. ఫైన్‌లో విజేతగా నిలిచిన జట్టుకు 5లక్షల రూపాయలతో పాటు కప్పును, రన్నర్‌గా నిలిచిన జట్టుకు 3లక్షలతో పాటు కప్పును అందచేశారు. 20 ఓవర్ట గల ఫైనల్ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన అర్బన్ జిపిఆర్ఎస్ 20 ఓవర్లలో 223 పరుగులు చేయగా 224 పరుగల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన అచ్చంపేట గ్రీన్ సిటీ జట్టు 122 పరుగుల మాత్రమే చేసి చేతులెత్తేసింది. ఫైనల్ మ్యాచ్‌ను భారత క్రికెటర్ మునాఫ్ పాటిల్, గుజరాత్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ తదితర ప్రముఖులు హాజరై పోటీని తిలకించారు. జహీరాబాద్ పట్టణంతో పాటు డివిజన్ పరిధిలోని ఆయా మండలాల్లోని గ్రామాల నుంచి యువత పెద్ద సంఖ్యలో చేరుకుని పోటీని ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో టౌర్నమెంట్ నిర్వాహకులు క్వైజర్ యాఫై, స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఫౌండర్ వహీద్ ఆహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సందర్బంగా దౌల్తాబాద్‌లో క్రికెట్ పోటీలు

**సంగారెడ్డి, జనవరి 16, ప్రభాతవార్త:**

హత్నూర మండలం దౌల్తాబాద్‌లో నిర్వహించిన ఆల్‌ఫతే సూపర్ సిక్స్ క్రికెట్ టోర్నమెంట్ (సెషన్-8) నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమంలో నిర్వహకులు టోర్నమెంట్ విన్నర్ టీం హత్నూర, రన్నర్ టీం దౌల్తాబాద్ లకు బహుమతులకు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొన్యాల వెంకటేశం, వార్డు సభ్యులు అజీజ్, హకీమ్, శ్రీకాంత్, పాండు, గౌస్, టోర్నమెంట్ నిర్వహకులు రఫీ, రిజ్వాన్ లను సర్పంచ్, వార్డు సభ్యులు అభినందించడం జరిగింది.



విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న నిర్వాహకులు



ముగ్గుల పోటీల్లో గెలిపొందిన మహిళకు గ్యాస్ స్టవ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

## బిఆర్ఎస్ నాయకుల అబీద్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**పటాన్‌చెరు, జనవరి 16, ప్రభాతవార్త:**

తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ఏకత్వంలో భిన్నత్వంలో కలిసిపోతాయని మైనార్టీ నాయకులు, బిఆర్ఎస్ నాయకులు అబీద్ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలే ఇందుకు నిదర్శమని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ముత్తంగి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బిఆర్ఎస్ నాయకులు అబీద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొ న్నారు. ఈ సందర్భంగా సుమారు 500 మంది మహిళలు వివిధ రూపాలలో వేసిన ముగ్గులను పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు ప్రజలు నిర్వహించుకునే ముఖ్య పండుగలో సంక్రాంతి ఒకటని ఈ పండుగ సందర్భంగా మహిళలకు ప్రతి సంవత్సరము అబీద్ ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భం గా ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి 11 వేలు విలువచేసే గ్యాస్ స్టవ్, ద్వితీయ బహుమతి 8 వేలు విలువచేసే కుక్కర్, తృతీయ బహుమతి 4 వేలు విలువచేసే గ్రైండర్, నాలుగో బహుమతి 3 వేల విలువచేసే కుకింగ్ సెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సిహెచ్ ప్రభాకర్ గుప్తా, మాజీ కో-ఆప్షన్ సభ్యులు అబ్దుల్ సత్తార్, మేరాజ్ ఖాన్, ఎండి కమురుద్దీన్, ఖాదర్, రవి, ఎండి సోన్‌ఖాన్, ఎండి సలీం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ శరత్ అధికారులకు సూచన**

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 16, ప్రభాతవార్త:**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఆర్జీలను సాధ్యమైనంత త్వర గా పరిష్కరించేందుకు చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ అధికా రులకు సూచించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (13) ఫిర్యాదులు అందాయి. ప్రజావాణికి అతి తక్కువ సంఖ్యలో ఫిర్యాదుదారులు వచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికా రులు, కలెక్టరేట్ ఏఓ తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎంఆర్ సభ్యులు ద్వారా ఆర్థిక సాయం చేస్తున్న దృశ్యం

## మృతుడి కుటుంబానికి ఆసరాగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు

**గుమ్మడిదల, జనవరి 16, ప్రభాతవార్త:**

గుమ్మడిదల మండలం వీరన్న గూడెం గ్రామ పంచాయతీలోని కట్టవెనుకగూడెం గ్రామంలో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన పొన్న బోయిన మోహన్ గత వారం క్రితం ప్రమాదంలో మరణించారు. ఈ విషయం గురించి గుమ్మడిదల మండల ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, మనసున్న మారాజు, బహుజన వర్గాల ముద్దబిడ్డ పేదల పెన్నిది చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజన తెలుపగా, వెంటనే స్పందించి మంచి మనసుతో మరణించిన మోహన్ భార్య మమతకు గుమ్మడిదల మండల ఎన్ఎంఆర్ యువసేన సభ్యుల ద్వారా 20 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. వారి కుటుంబ సభ్యులు నీలం మధు ముదిరాజ్‌కు ధన్యవాదాలె తెలిపారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మండల ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గ్యారల మల్లేష్, జింక గోపాల్, చింతల వీరేశ్, తుజాల్‌పూర్ వీరేశ్, దేవుని చెరువు నర్సింలు, పి కరుణాకర్, పి విజయ్, ఇప్ప నాగరాజు, పి శేఖర్, భీమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## భార్యను చంపిన భర్త

**రేగోడ్, జనవరి 16, ప్రభాతవార్త:**

భార్యను చంపిన భర్తపై కేసు నమోదు చేసిన సంఘటన సోమవారం రేగోడ్ పోటీస్ స్టేషన్‌లో సాయంత్రం చోటుచేసుకుంది. రేగోడ్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం చౌదర్పల్లి గ్రామానికి చెందిన కేశయ్యకు ఇద్దరు భార్యలు మొదటి భార్య లక్ష్మి భార్యభర్తలకు మనస్పర్ధలు రావడం వల్ల కె సయ్య లక్ష్మిలు గొడవలు పడ్డారు. కెసయ్య భార్య లక్ష్మిపై భర్తకేశయ్య, ఆయన సోదరుడు ఏవన్ కొట్టి లక్ష్మి (40), మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త కేశాయ్య, భర్త తమ్ముడు ఏవన్ కొట్టి లక్ష్మి అనే మహిళలను అకారణంగా కొట్టి చంపి గ్రామంలోని వాగులో పడేశారు. మృతురాలి అక్క పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

## కంటివెలుగు కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి**

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 16, ప్రభాతవార్త:**

రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 18 నుండి ప్రారంభించనున్న రెండవ విడత కంటివెలుగు కార్యక్రమానికి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. కంటివెలుగు ఏర్పాట్లపై శుక్రవారం జిల్లా కలెక్టర్లు, వైద్యాధికారులు, పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమీషనర్లకు టెలికాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రెండవ విడత కంటివెలుగు కార్యక్రమంలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా విజయవంతంగా నిర్వహించాలన్నారు. కంటి వెలుగు ఏర్పాట్లపై శుక్రవారం జిల్లా కలెక్టర్లు, వైద్యాధికారులు, పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమీషనర్లకు టెలికాన్ఫరెన్స్ ద్వారా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రెండవ విడత కంటివెలుగు కార్యక్రమంలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుంగా విజయవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో కంటివెలుగు క్యాంపు ఎప్పుడు నిర్వహిస్తారన్న సమాచారాన్ని ముందుగానే ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్యాంపు ఏర్పాటుకు కేటాయించిన సిబ్బందికి భోజనం, ఇతర వసతులకు కల్పించాలని, కార్యక్రమం నిర్వహణకు అధికారులు ప్రతిరోజు పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ మాట్లాడుతూ జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమానికి పటిష్టమైన ఏర్పాట్లను చేయడం జరిగింది. క్యాంపు నిర్వహణపై ప్రజలకు ముందుగానే టాంటాం, మైకు ఇతర సాధనాల ద్వారా తెలియజేస్తున్నట్లు తెలిపారు. క్యాంపుకు హాజరయ్యే ప్రజలకు ఇబ్బందులు కలుగకుంగా షామియా, మంచినీరు, కూర్చీలు, టెబ్లును ఏర్పాటు చేస్తున్నామని, అదే విధంగా కంటి వెలుగు కార్యక్రమ విధులు నిర్వహించే సిబ్బందికి భోజనం, అల్పాహారం, ఇతర వసతులను కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజర్షి షా, జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రి దేవి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, మున్సిపల్ కమీషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# యువకుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యం

**క్రికెట్ క్రీడాకారులకు రూ.లక్ష విలువైన క్రీడా సామాగ్రి అందజేత**
**సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రాచర్ల నరేష్**

**జగదేవ్‌పూర్, జనవరి 16 (ప్రభాతవార్త):**

జగదేవ్‌పూర్ మండలకేంద్రంలో నిర్వహిస్తున్న కెసిఆర్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ సందర్భంగా సోమవారం క్రీడాకారులకు చాట్లపల్లి సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాచర్ల నరేష్‌గుప్త క్రికెట్ జట్లకు సుమారు రూ.లక్ష విలువైన టీషర్ట్‌లు, క్రికెట్ కిట్‌లను రాష్ట్ర ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డిల చేతులమీదుగా క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహణకు ఆర్థిక సహకారం అందించడమే కాకుండా క్రీడాకారులకు క్రీడా సామాగ్రిని అందించడం అభినందనీయమని సర్పంచ్ రాచర్ల నరేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బాలేషం గౌడ్, ములుగు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ గుండా రంగారెడ్డి, ఎంపిటిసిల ఫోరం జిల్లా అధ్యక్షుడు కారింగుల కిరణ్‌గౌడ్, గజ్వేల్ ఏఎంసి వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్‌రెడ్డి, స్థానిక ఎంపిటిసి కవితశ్రీనివాస్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఎక్బాల్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు రావికంటి చంద్రశేఖర్, శ్రీపతి రాజేశ్వరిరవి, గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షుడు నాగరాజు, బిఆర్ఎస్ జిల్లా యువజన నాయకులు ఆలేటి సంతోష్‌రెడ్డి, కొండపోచమ్మ ఆలయ డైరెక్టర్ కుమ్మరి కనకయ్య, బిఆర్ఎస్ గ్రామ మాజీ అధ్యక్షుడు కొంపల్లి శ్రీనివాస్, బిఆర్ఎస్ మండల పార్టీ అధికార ప్రతినిధి పరమేశ్వర్‌ముదిరాజ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు టీషర్ట్స్, క్రీడా సామాగ్రిని అందజేసిన దృశ్యం